కనీవిని ఎరుగని రీతిలో

మహానాడు

- 5 లక్షల మందితో భారీ బహిరంగసభ
- ఐదురోజుల్లో వేదిక పూర్తి
- మహానాడు నిర్వహణపై కమిటీల ఏర్పాటు
- ఏర్పాట్లు పరిశీలించిన హోంమంత్రి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రులు
- సీఎం బస చేసే ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

(కడప - ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే టీడీపీ మహానాడును కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. జగన్ సొంత జిల్లా కావడంతో మహానాడుపై పార్టీ పూర్తిగా ఫోకస్ పెట్టింది. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడప నగర శివారు పబ్బాపురంలోని 125 ఎకరాల టీచర్స్ లేఅవుట్‌లో ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. మహానాడు తొలి రెండు రోజులు 23 వేల మంది ప్రతినిధుల సభ ఉంటుంది. పార్టీ సిద్ధాంతాలు, ఐడియాలజీపై, రాయలసీమ అభివృద్ధిపై చర్చ ఉంటుందని పార్టీ నేతలు చెప్పారు. చివరి రోజున 5 లక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహించి సత్తా చాటాలని నడుం కట్టారు. మహానాడును విజయవంతం చేసేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు ఆదివారం సాయంత్రం మహానాడు వేదిక వద్ద పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కో-ఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. హోంమంత్రి అనితతో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి, సవిత, బీసీ జనార్ధనరెడ్డి, ఎంపీలు కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, అమర్‌నాథరెడ్డి, నల్లారి కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి, బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావు, ప్రభాకర్‌చౌదరి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, బద్వేలు సమన్వయకర్త రితీష్ కుమార్‌రెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్ రెడ్డి, అడా చైర్మన్ రూపానందరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, ఆర్టీసీ చైర్మన్ పూలనాగరాజు, ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి తదితర టీడీపీ నాయకులు హాజరయ్యారు.

5 లక్షల మందితో బహిరంగసభ

బహిరంగసభను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కడపకు సమీపంలో ఉన్న రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి 5 లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి 2.10 లక్షల మందిని జనసమీకరణ చేయాలని టార్గెట్ ఇచ్చారు. ఇందులో కడప, కమలాపురం నుంచి చెరీ 50 వేలు జన సమీకరణ చేయాలని టార్గెట్ ఇచ్చింది. మిగతా నియోజకవర్గాలకు 10 నుంచి 15 వేలు జనసమీకరణ చేయాలని నిర్ణయించారు. జన సమీకరణ కోసం ఇన్‌చార్జ్‌లను నియమించారు. కడపకు అడపాటి రాజా, బీటీ నాయుడు, కమలాపురానికి ఏలూరు సాంబశివరావు, ఉగ్ర నరసింహారెడ్డి, బద్వేలుకు అమరనాథరెడ్డి, మైదుకూరుకు దేవినేని ఉమామహేశ్వర్‌రావు., ప్రొద్దుటూరుకు ప్రభాకర్‌చౌదరి, రాయచోటికి పుల్లారావు, పులివెందులకు అంజ నేయులు, రైల్వేకోడూరుకు దీపక్‌రెడ్డి, రాజంపేటకు రామాంజనేయులు, జమ్మలమడుగుకు జయనాగేశ్వరరెడ్డిని నియమించారు. ఇలా 50 నియోజకవర్గాలకు జన సమీకరణ కోసం ఇన్‌చార్జ్‌లను నియమించారు.

ఐదు రోజుల్లో వేదిక పూర్తి


125 ఎకరాల్లో మహానాడు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతానికి ముళ్లపొదలు తొలగించి లెవెల్ చేశారు. అయితే ఈనెల 23వ తేదీ లోపు వేదికను పూర్తి చేయాలని నిర్ణయించారు. నేటి నుంచి రేయింబవళ్లు పనులు చేయనున్నారు. తొలి రెండు రోజుల్లో జరిగే ప్రతినిధుల మీటింగ్‌కు ఒక వేదిక, బహిరంగ సభకు మరో వేదిక నిర్మించనున్నారు. ఇక ఎగ్జిబిషన్, బ్లడ్ డొనేషన్, గ్యాలరీలు ఇలా అన్నింటినీ అందుబాటులోకి తీసుకురానున్నారు. నిర్వహణను రెండు సంస్థలకు అప్పజెప్పారు. అలాగే బహిరంగ సభ సమీపంలోనే పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించడంతో అక్కడ అన్ని ఏర్పాట్లు మొదలు పెట్టారు. సీఎం చంద్రబాబునాయుడు మూడు రోజుల పాటు ఇక్కడే బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బస చేసే ప్రాంతాన్ని కలెక్టరు చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితి సింగ్‌లు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. సీఎం బస చేసే ప్రాంతాల్లో భద్రత, వీవీఐపీలకు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా గ్రీన్‌ఛానెల్ ట్రాఫిక్ ఏర్పాటు చేయాలని కలెక్టరు సూచించారు. వీఐపీలు వస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు చూడనున్నారు.

5 వేల మందితో భద్రత

మహానాడుకు 5 వేల మంది పోలీసులతో భద్రత కల్పించనున్నారు. పోలీసు బాస్‌లంతా కడపలోనే మకాం వేయనున్నారు. తొలిసారిగా కడపలో తొలిసారి మహానాడు నిర్వహిస్తుండటంత, జగన్ సొంత జిల్లా కావడంతో భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుంచి పనులన్నీ ముమ్మరంగా మొదలుకానున్నాయి.

కమిటీలు ఏర్పాటు

మహానాడు ఏర్పాట్లలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు 13 కమిటీలను నియమించారు. కో-ఆర్డినేషన్, స్టేట్ మేనేజ్‌మెంటు, కో-ఆర్డినేషన్ క్యాంపు కమిటీ, ట్రాన్స్‌పోర్టేషన్, పార్కింగ్, ఫుడ్, తొక్కిసలాట లేకుండా జనాభా మానిటరింగ్ కమిటీ, బ్లడ్ డొనేషన్, వలంటీర్, రిజిస్ట్రేషన్, హైజీన్ కమిటీ, అకామిడేషన్, ఫ్లవర్ డెకరేషన్ కమిటీలను నియమించారు. ఈ కమిటీలన్నీ వారికి కేటాయించిన పనులను చూసుకుంటూ పూర్తి చేస్తారు. సభకు వచ్చే ప్రతినిధుల కోసం ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని లాడ్జిలు, ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లతో పాటు విద్యాసంస్థలను బుక్ చేశారు.



మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

నెవ్వర్ బిఫోర్ ఎవర్ ఆఫ్టర్‌గా నిర్వహిస్తాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడును ఏ రాజకీయ పార్టీ నిర్వహించని విధంగా నెవ్వర్ బిఫోర్ ఎవర్ ఆఫ్టర్‌గా నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం కడప నగర శివారులోని మహానాడు వేదిక వద్ద విలేకరులతో మాట్లాడారు. 125 ఎకరాల్లో సువిశాలమైన మైదానం, ఇక్కడే పార్కింగ్‌కు ఎలాంటి సమస్య లేకుండా ఉందని తెలిపారు. మహానాడుకు వచ్చేవారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహానాడు తొలి రెండురోజులు పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్తులో చేయాల్సినవి, రాయలసీమకు జరిగిన అభివృద్ధిపై చర్చిస్తామని, మంత్రి నారాలోకేశ్ రూపొందించిన మై టీడీపీ యాప్‌ను ఆవిష్కరిస్తారని, మూడవ రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

రాయచోటిటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తామని తెలిపారు. త్వరలో అర్హులకు నూతన పింఛన్లు, ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో బాధితులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైళ్ల రాకపోకలు ప్రారంభం

- నెల రోజుల పాటు ప్యాసింజర్ రైళ్ల రద్దు
- పనులు పూర్తి కావడంతో పునరుద్ధరణ

ములకలచెరువు, మే 18 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం-తిరుపతి మార్గంలో ఆదివారం నుంచి రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం జంక్షన్‌లో ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ములకలచెరువు మీదుగా పగలు, రాత్రి నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్లు నెల రోజుల పాటు రద్దు రాగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు. ఈ మార్గంలో ప్రతిరోజూ నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్లను ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు మళ్లించడంతో మూడు నెలల పాటు రద్దయ్యాయి. గత నెల 1వ తేదీ నుంచి ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు పునరుద్ధరించారు. తిరిగి ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా గత నెల 16వతేదీ నుంచి ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధర్మవరం జంక్షన్‌లో ఇంటర్ లాకింగ్ పనులు పూర్తవ్వడంతో రైల్వే శాఖ అధికారులు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

పెద్దిరెడ్డి ఆక్రమిత భూమి

స్వాధీనానికి శ్రీకారం?

- నేడు పోలీసు బందోబస్తుతో బీకే పల్లెకు...
- కంచె తొలగించి స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వ భూమి

7



గమ్యానికి చేరువయ్యేలోపే...

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ముగ్గురిని బలి తీసుకున్న నిద్రమత్తు
- చాకచక్యంగా బయటపడ్డ ఇద్దరు
- పీలేరు మండలం బాలంవారిపల్లె వద్ద ఘటన
- మృతులు, తప్పించుకున్న వారు వంట మాస్టర్లు
- క్యాటరింగ్ కోసం పీలేరుకు వస్తుండగా ప్రమాదం

మృతుల వివరాలు...



ప్రమాదంలో మృతి చెందిన శివానంద, లోకేశ్, చలపతి

కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా ముతకనహళ్లికి చెందిన ఎస్.లోకేశ్ (36). లోకేశ్‌కు భార్య చందన (28), అమూల్య (10), భాస్కర్ (8) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా చాంద్రహళ్లికి చెందిన సీఎం శివానంద (44). ఇతడికి భార్య కవిత (38), చందన (17), భార్గవ్ (15) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా సుగుటూరుకు చెందిన ఎన్.చలపతి (48). ఇతడికి భార్య చైత్ర (42), వినీల్ (15), వినీత (13) ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పీలేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కల కష్టం మీద బతికే వంట మాస్టర్లు. వేర్వేరు ఊర్లకు చెందిన వారైనప్పటికీ వృత్తిరీత్యా ఒకటయ్యారు. ఒక జట్టుగా ఏర్పడి క్యాటరింగ్ కాంట్రాక్టు సంస్థల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కడ ఆర్డర్లు లభిస్తే అక్కడికెళ్లి వంటలు చేసేవారు. అలా పీలేరులో ఓ శుభకార్యంలో వంటలు చేయడానికి వస్తూ మృత్యువాతపడ్డారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా ముతకనహళ్లికి చెందిన ఎన్.లోకేశ్, జి.తిప్పారెడ్డి, చాంద్రహళ్లికి చెందిన సీఎం శివానంద, సీవీ సునీల్, కోలారు జిల్లా సుగుటూరుకు చెందిన ఎన్.చలపతి వంటమాస్టర్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరు ఆదివారం ఉదయం పీలేరులో జరిగే ఓ శుభకార్యంలో వంటలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం హోసూరులో శనివారం రాత్రి జరిగిన ఓ శుభకార్యంలో వంటలు చేసిన అనంతరం శివానందకు చెందిన కారులో రాత్రి 12 గంటలకు హోసూరు నుంచి పీలేరుకు బయలుదేరారు. లోకేశ్ డ్రైవింగ్ చేస్తుండగా ఆదివారం తెల్లవారుజాము 4.15 గంటల ప్రాంతంలో కారు జి.కురవపల్లె వద్దకు రాగానే నిద్రమత్తులో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పాడుబడిన వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లి మునిగిపోయింది. ప్రమాదం జరిగిన తీరుకు అప్రమత్తులైన జి.తిప్పారెడ్డి, సునీల్ కారు వెనకున్న అద్దాన్ని గట్టిగా తన్ని దాని ద్వారా బయటకు వచ్చేశారు. సహచరులను కూడా కారులో నుంచి వెలిసి తీసేందుకు ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేకపోవడంతో వారు బావి సమీపంలో ఉన్న ఇంటి వద్దకు వెళ్లి ప్రమాదం గురించి తెలియజేశారు. దీంతో ఆ ఇంటి వారు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్థులు చేసిన ప్రయత్నాలూ సఫలం కాకపోయేసరికి పోలీసులు క్రేన్ సాయంతో కారును బాలిలో నుంచి వెలికితీశారు. అప్పటికే కారులో చిక్కుకున్న ముగ్గురూ విగతజీవులుగా మారిపోయారు.



క్రేన్ సాయంతో బావిలో నుంచి కారును బయటకు తీస్తున్న పోలీసులు, గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది



విలపిస్తున్న మృతుల బంధువులు

సకాలంలో గ్రామస్థులు స్పందించినప్పటికీ...

కారు బావిలోకి దూసుకెళ్లిందన్న విషయం తెలియగానే అటు బాలంవారిపల్లె, కురవపల్లె గ్రామస్థులు స్పందించారు. తమకెందుకులే అని పోలీసులు, ఇతర సాయం కోసం వేచి చూడకుండా పెద్దపెద్ద కర్రలతో కారును బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. కారును నీటిలో నుంచి వెలికితీసేందుకు తమకు చేతనైన రీతిలో ప్రయత్నించారు. బావిలో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తోడేసేందుకు ప్రయత్నించారు. క్రేన్ వచ్చినప్పటికీ విశ్రమించకుండా నీళ్లలోకి దిగి కారులో ఉన్న వారిని కాపాడాలనే తపనతో కారుకు తాళ్లు కట్టడం వంటి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేశారు. అయినప్పటికీ అందులో ఉన్న వారిని కాపాడలేకపోయారు. గ్రామస్థుల సహకారాన్ని అటు పోలీసులు, ఇటు ప్రమాదంలో బయటపడిన వారు అభినందించారు. ప్రమాదంలో మరణించిన వారికి పీలేరు పోలీసులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. 'నాలుగు చోట్ల నాలుగు వంటలు చేసుకుని బతికే వాళ్లం, వంట మీద వచ్చే అరకొర ఆదాయంతో బతుకుతున్న వాళ్లం, ఇంటి పెద్దల్ని కోల్పోయి ఇప్పుడు ఎలా బతకాలిరా దేవుడా' అంటూ మృతుల బంధువులు గుండెలవిసేలా ఏడ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ



ప్రమాదం నుంచి బయటపడిన తిప్పారెడ్డి, సునీల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కురవపల్లె వద్ద కర్ణాటక వాసులకు జరిగిన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పందించారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్‌తో ఫోన్‌లో మాట్లాడి కారులో ఉన్న వారిని కాపాడేందుకు ప్రయత్నించాలని సూచించారు. వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో నుంచి సురక్షితంగా బయటపడిన వారితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మృతులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పడమే కాకుండా వారి తక్షణ అవసరాల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

తిరునాళ్లలో ఉప్పొంగిన భక్తిభావం




శిరస్సుపై కలశాలు పెట్టుకుని ఊరేగింపుగా వెళుతున్న భక్తులు... చాందినీ బండ్ల వద్ద కోలాటం చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో ఆదివారం భక్తిభావం ఉప్పొంగింది. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన తిరునాళ్లు, జాతరలు కన్నుల పండువగా సాగాయి. రైల్వేకోడూరు పట్టణం అంకమ్మనగర్‌లో వెలసిన జాంబవంతస్వామి తిరునాళ్లలో భాగంగా భక్తులు శిరస్సుపై కలశాలు పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జాంబవంతస్వామి భక్తులు పోతురాజు అమరేంద్ర కుమారులు పోతురాజు నవీన్, సుమన్, మనవడు సాయిచార్విక్ అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు చెన్నంశెట్టి బాలగంగాధర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మ జాతర

చిన్నమండెం, మే18(ఆంధ్రజ్యోతి): చాకిబండ గ్రామం రెడ్డివారిపల్లిలో యల్లమ్మ తల్లి జాతర ఘనంగా సాగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు నాలుగు చాందినీ బండ్లు కట్టారు. రెడ్డివారిపల్లె ప్రజల ఆహ్వానం మేరకు విచ్చేసిన మంత్రి బాణసంచాలు, గజమాలలతో ఘనస్వాగతం పలికారు. యల్లమ్మకు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి చాందినీ బండ్లను ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో పాలేటమ్మ జాతర

పాలేటమ్మ జాతరను శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చాందినీ బండ్లను ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ఇరుగులమ్మ తిరునాళ్లు

సిద్దవటం, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపల్లె క్రాస్ సమీపాన వెలసిన గ్రామదేవత ఇరుగులమ్మ అమ్మవారి తిరునాళ్లలో భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ పూజారి రమణ పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

జాతరలు తెలుగు సంస్కృతికి ప్రతీకలు

రాయచోటిటౌన్, మే18(ఆంధ్రజ్యోతి): జాతరలు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాధవరం మూల గంగమ్మ తిరునాళ్లలో పాల్గొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇచ్చిన విందుల్లో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేశ్, సైకం రమేశ్‌రెడ్డి, దివాన్, మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డిలతో కలిసి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో...

మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు.

ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భక్తులతో క్యూలైన్ కిక్కిరిశాయి. పూజల్లో అర్చకులు సెల్లు గంగన్న, సురేంద్ర తదితరులు అమ్మవారి ప్రసాదాలు పంచిపెట్టారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుల్లంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి):సాయుధ బలగాలకు మద్దతుగా జాతీయ భద్రత కొరకు ప్రజల భాగస్వామ్యంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 100 అడుగుల జాతీయ జెండాను చేతపట్టి భారతమాతాకి జై, వందేమాతరం నినాదాలతో సాహిత్య బలగాలకు మేమున్నామంటూ భారీఎత్తున పుల్లంపేటలో తిరగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ పెహల్గాంలో దాడిపై ప్రధానమంత్రి నరేంద్రమోడి ఆపరేషన్ సింధూరి పేరుతో త్రివిద దళాలు మన శత్రు దేశమైన పాకిస్తాన్‌లోని శత్రు స్థావరాలపై ప్రపంచం విస్తుపోయే విధంగా దాడులు చేసి తీవ్రవాద స్థావరాలను ముట్టుపెట్టడం జరిగిందన్నారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, అసెంబ్లి కన్వీనర్ చెంగల్‌రాజు, ఆదినారాయణ, కంబాల శ్రీనివాసులు, పుల్లారెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖులు జైసింహ, కవయిత్రి హైమావతి, మహిళా నాయకురాలు సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సుండుపల్లె, మే18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ సత్రం సమీపంలో కస్తూరమ్మ ఆలయం వద్ద 'హిందూ బంధువులం శ్రీరాముని సేవకులం' బృందం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కడప హోలిస్టిక్ హాస్పిటల్, పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా పాల్గొని వైద్య సేవలను అందించారు. ఈ వైద్య శిబిరానికి పెద్దినేనికాలువ, ముడుంపాడు, మాచిరెడ్డిగారిపల్లె, మడితాడు గ్రామ పంచాయతీల నుంచి సుమారు 150 మంది రోగులు వచ్చి ఉచితంగా వైద్యం పొందిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన
ఓబినేని సుబ్బమ్మ

ఒంటిమిట్ట, మే 18 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను ఆదివారం సాయంత్రం రాష్ట్ర టీడీపీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ కలిశారు. ఈ సందర్భంగా సిద్దవటం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించారని, తాను గత 15 సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రికి తెలియజేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తనుకు అవకాశం కల్పించాలని ఆమె కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సుబ్బమ్మ తెలిపారు. మంత్రిని కలిసినవారిలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి పాడి ఆవు మృతి

సుండుపల్లె,మే18(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బూడిదేటివాండ్లపల్లెకు చెందిన శివయ్య అనే రైతుకు చెందిన పాడి ఆవు ఆదివారం విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. సుమారు రూ.60 వేల విలువ చేసే పాడి ఆవు మృతి చెందడంతో ఆర్థిక ఇబ్బంది ఏర్పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేశ్‌బాబును వివరణ కోరగా ప్రభుత్వం నుంచి రైతుకు ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు.

పోరాటాలతోనే
సమస్యలు పరిష్కారం : సీపీఐ

ఓబులవారిపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఐ బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం గోవిందంపల్లె పంచాయతీలో భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామస్థాయి సభ నిర్వహించారు. మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందంపల్లె పంచాయతీ శంకరాపురం దళితవాడలో ఇళ్ల మీద విద్యుత్‌లైన్ ఉండడం వల్ల ఇద్దరు మృతి చెందారని, దీన్ని మార్చాలని కోరారు.

కనుల పండువగా నరసింహుని పుష్పాభిషేకం



పుష్పాభిషేకం కోసం ఏర్పాటు చేసిన పలు రకాల పూలు

పెనగలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈటమాపురం గుట్టపై వెలసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుని పుష్పాభిషేకం కన్నులపండువగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్ బత్తిన గుండాల్‌రెడ్డి మహేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో బెంగళూరు ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన రకరకాల సువాసన పుష్పాలతో పుష్పాభిషేకం కన్నులపండుగవగా నిర్వహించారు. టీటీడీకి చెందిన బాలాజిస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులకు ఈటమాపురం, రాచపాలెం గ్రామ ప్రజలు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు మెగా జాబ్‌మేళా

నందలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అన్నమయ్య జిల్లా - ఉపాధి కల్పన వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ(ఎస్ఈఈడీపీ) ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణతో నిమిత్తం లేకుండా నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ఆకేపాడు క్రాస్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, పేటీఎం, ఎస్‌బీఐ కార్డ్స్, సూపర్-కె, టాటా ఏఐఏ, ఆదర్శ ఆటో వరల్డ్, మారుతి సుజుకి, ఏయూ స్మాల్ ఫైనాన్స్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కావున ఈనెల 20న ఉదయం 9 గంటలకు ఆసక్తిగల నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరవ్వాలన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజు కలర్ ఫొటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 9676736623, 9381695985 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, మే18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఏపీజీఈఏ అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, కార్యవర్గ సభ్యులు మంత్రిని సత్కరించారు. అనంతరం జూన్ 5న విజయవాడలో జరగనున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారన్నారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, రాయచోటి తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సుజిత్‌డాల్, ఉపాధ్యక్షుడు మోహన్‌బాబు, నాగేంద్ర, సంయుక్త కార్యదర్శి వలి పాల్గొన్నారు.

గవర్నర్‌చే ప్రశంసలు అందుకున్న సిద్దవటం మండలవాసి



గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న వాసంతి

సిద్దవటం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె సాయినగర్‌కు చెందిన మామిడి ఓబులరెడ్డి కుమార్తె మామిడి వాసంతి పులివెందుల జేఎన్‌టీయూలో 2023-2024లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులో యూనివర్సిటీలో ప్రథమ స్థానం గ్రేడ్ 9.2 ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. శనివారం రాత్రి అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ ఇంజనీరింగ్ యూనివర్సిటీలో గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆదివారం వాసంతి తన నివాసంలో మాట్లాడుతూమా తల్లిదండ్రులు కృషి వల్లే ఈ విజయం సాధ్యమన్నారు.

గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

రామాపురం, మే18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర డిమాండ్ చేశారు. ఆదివారం వారు పాత రామాపురంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పినాక సాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో
ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా తరగతులు



శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

రాయచోటిటౌన్, మే18(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో గల షిరిడిసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఐఆర్ఎస్ అధికారి యాదగిరి పర్యవేక్షణలో పినాక సాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మోటివేషన్‌లో ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ మురళీమోహన్, ప్రముఖ న్యాయవాది ఈశ్వరయ్య, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు, ఉపాధ్యాయులు రామ్మోహన్, రాజేంద్ర, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, గౌనిపల్లి మదన్‌మోహన్ తదితరులు పాల్గొని ఉచిత శిక్షణ గురించి వివరించారు. ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు కోర్స్ డైరెక్టర్లు కోటకొండ రఘు, గౌనిపల్లి శివ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. పూర్తి సమాచారం కోసం 9550136976, 9533595593కు సంప్రదించాలన్నారు.

'చంద్రబాబును విమర్శించే అర్హత వైసీపీకి లేదు'

సంబేపల్లె, మే18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత వైసీపీకి లేదని టీడీపీ నాయకుడు మడితాటి రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబును అక్రమ అరెస్టు చేసినప్పుడు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి నీతి పాఠాలు ఏమయ్యాయన్నారు. అక్రమ మద్యం కేసులో విచారణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. అభివృద్ధి అంటే చంద్రబాబు అని అందరికీ తెలుసునన్నారు.

చంద్రబాబు చొరవతో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలియజేశారు.


సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

రాయచోటిటౌన్, మే18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. 15 నెలలుగా డీసీసీబీ నుంచి రావాల్సిన సిబ్బంది జీతాలతో పాటు అరియర్స్, బ్రాంచ్‌లలో పనిచేసే సహకార సంఘాల సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే 2019 నుంచి 2024 వరకురావాల్సిన పీఆర్‌సీని అమలు చేయడంతో పాటు సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బంది రెగ్యులర్ చేయడం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. అందుకు మంత్రి స్పందించి తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

'దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి తగదు'

ఓబులవారిపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి) : దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి తగదని దళిత నేతలు పేర్కొన్నారు. ఆదివారం చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ సి.కమ్మపల్లె దళితవాడలో దళిత నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్ కిడ్నాప్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, భారత బహుజన సేన రాష్ట్ర నాయకుడు కూని లక్ష్మీనారాయణ, పుల్లంపేట మండల నాయకులు ముత్యాల గాజుల శీను, సీనియర్ నాయకులు మన్యం బ్రహ్మయ్య, మునలికొప్పు వాసుదేవయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: కస్తూరి



కార్యకర్తలతో మాట్లాడుతున్న కస్తూరి

పుల్లంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు భరోసా ఇచ్చారు. ఆదివారం రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద టీడీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం నుంచి అనంతంపల్లె, అప్పయ్యరాజుపేట మీదుగా రంగంపల్లె, వడ్డిపల్లె వరకు టీడీపీ శ్రేణులు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. రంగంపల్లె, వడ్డిపల్లెలో నాయకులు, కార్యకర్తలు కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ తరలిరావాలన్నారు. కార్యకర్తలందరికీ న్యాయం చేస్తానన్నారు. రంగంపల్లె, వడ్డిపల్లెకు చెందిన టీడీపీ నేత రవి ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు, అజయ్‌బాబు, నాయుడోరి రమణ, నూకల ఫణీష్, రొంపిచెర్ల మురళి, కొండేటి రమణ, మురళీరెడ్డి, కేశవరెడ్డి, గండికోట సుబ్బరాయుడు, మస్తాన్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జనసేన పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు: ఎమ్మెల్యే



సభ్యత్వ గుర్తింపు పత్రాలతో జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు

రైల్వేకోడూరు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని ఆ పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు సభ్యత్వాలు అత్యధికంగా నమోదు చేసిన కార్యకర్తలను ఘనంగా సన్మానించామని తెలిపారు. జనసేన సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి రూ.5లక్షల బీమా సౌకర్యం ఉంటుందన్నారు. వారికి ప్రత్యేక గుర్తింపు పత్రాలు, కార్డులు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కడప జిల్లా ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ పగడాల వెంటేష్, జోగినేని మణి, నాయకులు ఆలం రమేష్, జడల సతీష్, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పగడాల వరలక్ష్మి పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టులకు నిధులు మంజూరు చేయండి



మంత్రి రామానాయుడికి వినతిపత్రం ఇస్తున్న కళాచంద్ర

పెనగలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం నారాయణనెల్లూరు గ్రామ పరిధిలోని చెయ్యేటికి అనుసంధానంగా ఉన్న ఊటకాలువలు, తాగునీటి సరఫరా కాలువలపై దెబ్బతిన్న కల్వర్టుల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇచ్చినట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె కళాచంద్ర తెలిపారు. ఆదివారం మంత్రి రాజంపేట పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి విన్న వించామన్నారు.స్పందించిన మంత్రి రామానాయుడు, పక్కనే ఉన్న ఇరిగేషన్ ఎస్ఈ రమణతో మాట్లాడుతూ వెంటనే ఎస్టిమేట్‌లు తయారు చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O.: 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M.: 99854 11184

పెద్దిరెడ్డి ఆక్రమిత భూమి స్వాధీనానికి శ్రీకారం?

- నేడు పోలీసు బందోబస్తుతో బీకే పల్లెకు...
- కంచె తొలగించి స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వ భూమి



మదనపల్లె బైపా‌స్‌రోడ్డు నుంచి బీకేపల్లె ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు.. దానిపక్కనే ఉన్న చెక్‌డ్యాం, వర్షపునీటి కాలువ (ఫైల్‌ఫొటో)



భూమి చదును చేసిన తర్వాత అదృశ్యమైన చెక్‌డ్యాం, కాలువ



ప్రభుత్వ భూమితో పాటు ఫెన్సింగ్ వేసిన వివాదాస్పద భూమి

మదనపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ కబంధ హస్తాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో వ్యూహరచన చేయగా సోమవారం స్వాధీనానికి ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఇప్పటికే తహసీల్దార్ ధనంజయులు, మండల సర్వేయర్ రెడ్డి శేఖర్‌బాబులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు ఉదయం 6 గంటలకే అందుబాటులో ఉండాలని సూచించారు. మదనపల్లె చుట్టూ పెద్దిరెడ్డి కుటుంబమే కాదు..వారి అనుచరులు ప్రభుత్వ, ప్రైవేటు భూములను పెద్ద ఎత్తున ఆక్రమించారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో పేదలు, రైతులు ఇలా ప్రతి ఒక్కరి నుంచి నయానో, భయానో స్వాధీనం చేసుకున్న ఉదంతాలు చాలానే ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి అధీనంలోని భూములను స్వాధీనం చేసుకోవడం కానీ, ఆక్రమిత భూమిలోకి ప్రవేశించిన దాఖలాలు లేవు. అయితే మొదటిసారిగా మదనపల్లె శివారు ప్రాంతాల్లోని అత్యంత ఖరీదైన బీకే పల్లె రెవెన్యూ గ్రామం-552లోకి ప్రవేశించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మూహూర్తం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. వారం రోజులుగా వ్యూహరచన చేయగా రెండురోజుల క్రితం కలెక్టరేట్‌లో డేట్‌ఫిక్స్ చేసినట్లు తెలిసింది. ఆది నుంచీ వివాదాలకు కేంద్రంగా మారిన బి.కె.పల్లె సర్వేనంబర్-552లో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలత పేరున భూములు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే రికార్డుల పరంగా వచ్చిన భూమి ఎంత? ఆ భూమి చుట్టూ ఆక్రమించిన భూమి ఎంత? అనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ నెంబర్‌పై సర్వే చేసి తేల్చాలని మండల సర్వేయర్‌కు చెబుతున్నారు. అయితే ఆయన రోవర్ రిపేరు వచ్చిందని, సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని చెబుతూ వచ్చినట్లు తెలిసింది. దీనిపై కలెక్టర్ దృష్టి సారించడంతో సోమవారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమిత భూమిని గుర్తించి, ఆ భూమి చుట్టూ వేసిన కంచెను తొలగించి ప్రభుత్వ భూమికి ట్రెంచి కొట్టాలని ఆదేశించారు. ఇందుకు ఓ అధికారి భయపడుతూ అటు, ఇటుగా చెప్పడంతో పోలీసు బందోబస్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. అయితే తాను సర్వే వరకే పరిమితం అవుతానని, ఆక్రమణలు తొలగించడం, స్వాధీనం చేసుకోవడం మీరే చూసుకోవాలనే ప్రతిపాదన పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందుకు ఓకే చెప్పడంతో పోలీసు బందోబస్తుతో పాటు వీర్వోలు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఉదయం 6 గంటలకే బైపాస్ రోడ్డులోని బి.కె.పల్లెలోని ఆక్రమిత స్థలానికి చేరుకోవాలని సూచించినట్లు తెలిసింది. అయితే కలెక్టర్ చెప్పినట్లు తహసీల్దార్, సర్వేయర్, సిబ్బంది ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ముందుకొస్తారా? లేక వాయిదా వేసి తప్పించుకుంటారా? అన్నది సోమవారం తేలనుంది. ఇక్కడి భూమిని మాజీ సైనికుడి కుటుంబం నుంచి కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. 20 ఏళ్లుగా వివాదంలో ఉన్న ఈ భూమిని పెద్దిరెడ్డి కుటుంబం అధికార బలంతో హస్తగతం చేసుకుంది. దీంతో పాటు అక్కడి భూమిలో నిర్మించిన చెక్‌డ్యాంను ధ్వంసం చేసి నామరూపాలు లేకుండా పూడ్చేశారు. అలాగే బి.కె.పల్లె పైభాగం నుంచి వర్షపునీటి కాలువను కబ్జా చేశారు. చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. అప్పట్లో దీనిపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని అధికారులు ఆ భూమి దరిదాపులకు కూడా వెళ్లలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో పెద్దిరెడ్డి అక్రమాలు, ఆక్రమణలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూములను పెద్దఎత్తున ఆక్రమించినట్లు గుర్తించిన ప్రభుత్వం పెద్దిరెడ్డిపై కేసులు నమోదు చేయాలని స్వయానా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పెద్దిరెడ్డి, వారి అనుచరులు ఆక్రమిత సామ్రాజ్యాల స్వాధీనంలో భాగంగా ప్రభు త్వం దృష్టి సారించినట్లు చర్చ జరుగుతోంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో? ఎలా ముందుకెళ్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య

కడప ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘా ల ఐక్యవేదిక పిలుపుమేరకు ఈనెల 21వ తేదీ జరగబోయే జిల్లావిద్యాశాఖ అధికారి కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం ఆపస్ కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల అసం బద్ధంగా జారీ చేసిన 19,20,21 జీఓలను రద్దుచేయాలని, ఇంగ్లీష్ మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియంను కూడా అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి 1:20గా ఉన్నత పాఠశాలలో 1:30గా ఉంచాలనే తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చిన 17 సమ స్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోగుల వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ గత 30వారాలుగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉపాధ్యాయ సంఘాల నేతలను సమావేశపరిచి అభిప్రాయాలు తీసుకొని ఒక దాన్ని కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయ సంఘా లు పోరాటం చేసి విద్యావ్యవస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్య దర్శి కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక ధర్నాకు ఆర్జేయూపీ మద్దతు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర విద్యాశాఖ అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన డీఈఓ ఆఫీసు ముట్టడి కార్యక్రమానికి రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్‌లు తెలిపారు. ఆదివారం భుజంగరావు టీచర్స్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక దఫాలుగా ఉపాధ్యాయ సంఘాలు చేసిన విజ్ఞప్తులు సూచనలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యారంగ తిరోగమనం దిశగా చర్యలు తీసుకుంటూ, ఉపాధ్యాయులను అయోమయంలోకి నెట్టడం సబబు కాదన్నారు. రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయుల పోస్టులను కుదించి, సర్‌ప్లస్ పోస్టులు సృష్టించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షులు గుడిబండ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సహాధ్యక్షులు రెడ్డన్న, రాముడు, కామేష్ తదతరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



గణేశ్ మృతదేహం

చెన్నూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంపాడుకు చెందిన పత్తూరు గణేశ్ (26) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గణేశ్ కడప నగరంలో పెయింటు పనిచేస్తూ జీవించేవాడు. ఇతనికి ఏడాదిన్నర క్రితం అంజు అనే యువతితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భవతి. ఆదివారం మధ్యాహ్నం తండ్రి, బావతో కలిసి స్థానిక పెన్నానదిలో చేపలు పట్టేందుకు వెళుతుండగా దారి మధ్యలో రెండు రోజుల క్రితం వీచిన గాలివానకు వేలాడుతున్న విద్యుత్‌వైర్లు తగలడంతో షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే అతని తండ్రి, బావలు వైర్లను పక్కకు తప్పించి వైద్యుడికి సమాచారం ఇవ్వగా అతను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

భారీ వర్షానికి మిద్దె కూలి ఇద్దరికి తీవ్ర గాయాలు



గజ్జెలవారిపల్లెలో భారీ వర్షాలకు కూలిన మిద్దె

పెద్దతిప్పసముద్రం మే 18 (ఆంధ్రజ్యోతి): పీటీఎం మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రాతి మిద్దె కూలడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... తుమ్మరకుంట గ్రామం గజ్జెలవారిపల్లెకు చెందిన తోపల శంకర తోపల నేత్రావతి దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. శనివారం యధావిధిగా రాత్రి భోజనం చేసి తమ ఇంటిలో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో మిద్దె లోపల నిద్రిస్తున్న తోపుల శంకర భార్య నేత్రావతి, కుమారుడు హరీ‌ష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి బండల కింద పడిపోయిన నేత్రావతి, హరీ‌ష్‌లను మదనపల్లెలోనే ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

చెట్టు కూలి వసతి గృహం ప్రహరీ నేలమట్టం



కూలిపోయిన బీసీ మహిళల వసతి గృహం ప్రహరీ

సిద్దవటం, మే 18 (ఆంధ్రజ్యోతి): సిద్దవటంలో శనివారం పెనుగాలుల బీభత్సంతో బీసీ మహిళా విద్యార్థినుల వసతి గృహంపై చెట్టు విరిగి పడడంతో ప్రహరీ గోడ పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంతాన్ని ఆదివారం బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపడతామనితెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవి, అటెండర్ అమల, వాచ్‌మెన్ పెంచలమ్మ పాల్గొన్నారు.

26 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

సుండుపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ఎంకేఆర్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 23వ తేదీ లోపు తమ టీం ఎంట్రీలను 9963368120, 9381145683 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

అంగరంగ వైభవంగా గర్నిమిట్ట తిరునాళ్లు





ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ అమ్మవారు, అమ్మవారికి బోనాలు, పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

పీలేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్టలోని యల్లమ్మ తల్లి తిరుణాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తిరుణాల సందర్భంగా అమ్మవారికి ఆదివారం ఉదయం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం చింతమాకులపల్లెకు చెందిన వనం రాజశేఖర నాయుని కుటుంబసభ్యులు అమ్మవారికి తొలి బోనం సమర్పించి తిరుణాలను ప్రారంభించారు. నాయునివారి పూజ అనంతరం ఆలయంలో భక్తుల సందడి ప్రారంభమైంది. కేవీపల్లె మండలంతో పాటు పీలేరు, సుండుపల్లె, కలికిరి, కలకడ మండలాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా కేవీపల్లె, గర్నిమిట్ట పరిసర ప్రాంతాల్లోని ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణం నెలకొంది. విద్య, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం బయటి ప్రాంతాల్లో ఉన్న చాలా మంది తిరుణాల కోసం స్వస్థలాలకు చేరుకుని కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కలకడ ఇన్‌చార్జ్ సీఐ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో కేవీపల్లె ఎస్‌ఐ చిన్నరెడ్డయ్య నేతృత్వంలో 60 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు గుడి వెంకటరమణ, గుడి శ్రీనివాసులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సూర్యప్రభ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు పురవీధుల్లో శ్రీవారి ఊరేగింపు

జమ్మలమడుగు, మే 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తుల కోలాటం మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపు చేశారు. అనంతరం స్నపన తిరుమంజనం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంలో శ్రీవారు దర్శనమిచ్చారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా జమ్మలమడుగు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఆర్ మైదానం)లో ఆదివారం ఒంగోలు జాతి ఎడ్ల జాతీయస్థాయి బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఆదివారం జూనియర్ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించగా 13 జతల ఎడ్లు పాల్గొన్నాయని.. సోమవారం సీనియర్ కేటగిరి విభాగంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆదినారాయణరెడ్డి

మునిబాబుకు డాక్టరేట్



వైస్ చాన్సలర్ హెచ్.సుదర్శన్‌రావు చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న మునిబాబు

పులివెందుల రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ముమ్మెల మునిబాబు జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్‌రావు చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మునిబాబు వీడియో ట్రాన్స్‌మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఇన్ వైర్‌లెస్ నెట్‌వర్క్‌లో పరిశోధనలు చేశారు. జేఎన్టీయూ అనంతపూర్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ చెన్నారెడ్డి, కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ప్రవీణ్ శ్యామ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేశారు. శనివారం అనంతపురం జేఎన్టీయూలో జరిగిన 14వ స్నాతకోత్సవం కార్యక్రమంలో వైస్ చాన్సలర్ చేతులమీదుగా పట్టా అందుకున్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి

చక్రాయపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో 19 నుంచి 22వ తేదీ వరకు హనుమజ్జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు అకురార్పణ, అనుజ్ఞ, విశ్వక్సేన ఆరాధన తదితర కార్యక్రమాలతో ప్రారంభమవుతా యన్నారు. 20, 21, 22 తేదీలలో ఉత్సవ పూజలు, హోమాలు ఉంటాయన్నారు. చివరి రోజు 22వ తేదీ ఉదయం 9గంటల నుంచి అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

మెగా డీఎస్సీ ప్రశ్నార్థకం...తులసిరెడ్డి

వేంపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డీఎస్సీ ప్రశ్నార్థకమైందని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విచారం వెలిబుచ్చారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలని మూడు రకాల పాఠశాలలు ఉండేవన్నారు. అందరికి సౌకర్యంగా, సౌలభ్యంగా ఉండేవన్నారు. వైసీపీ పాలనలో శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్+, ప్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్+ అని ఆరు రకాల స్కూళ్లు పెట్టి అయోమయం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యను తొమ్మిది రకాలుగా విభజించి చీలికలు పేలికలుగా చేసిందన్నారు. హైస్కూళ్లలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40 బదులు, 1:53 చేసిన ఫలితంగా 6428 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలారన్నారు. ఈ నేపథ్యంలో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డీఎస్సీ ప్రశ్నార్థకమైందన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి మూడుశాతం అదనపు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే నల్లారి

వాల్మీకిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన వాల్మీకిపురం మండలంలోని శాకంవారిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నెలకొన్న సమస్యలన్నింటినీ తప్పక పరిష్కరిస్తానన్నారు. సమస్యలు నేరుగా తన దృష్టికి తెస్తే అప్పటికప్పుడు పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో తనపై ఉన్న నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల రుణం అభివృద్ధితో తీర్చుకుంటానని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేశ్వర్‌నాయుడు కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, నాయకులు కంభం నిరంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, బభ్రువాహన్ సురేష్, మోహన్‌నాయుడు, డిల్లి బాబు, ఆనందనాయుడు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మార్చురీలో రాకేష్ మృతదేహం వద్ద సంతాపం వ్యక్తం చేస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

కలికిరి: ఈతకు వెళ్లి మృతి చెందిన జేఎస్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి రాకేష్ కుటుంబీకు లను ఆదివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థి రాకేష్ మృత దేహాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కిశోర్‌కుమార్ రెడ్డి పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు. విద్యార్థి మృతి తనను కలిచివేసిందన్నారు. మృత దేహానికి ఆలస్యం లేకుండా పరీక్షలు పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించాలని వైద్యులను ఆదేశించారు. దాదాపు 1100 కిలోమీటర్లు వెళ్ళాల్సి వున్నందున ఎలాంటి ఇబ్బందులకు అవకాశం లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాల న్నారు. ఎమ్మెల్యే వెంట మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, రమణ తదితరులున్నారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

తంబళ్లపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ 50 శాతం రాయితీ ప్రకటించిందని ఏఈ సురేంద్ర, సబ్ ఇంజనీర్ శేషుకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...అదనపు లోడ్‌కు 1కిలో వాట్‌కు అసలు ధర రూ.2,250 ఉండగా, రాయితీ ప్రకారం కిలోవాట్‌కు రూ.1,250లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. 2 కిలోవాట్లకు రూ.2,450లు, 3కిలోవాట్లకు .రూ.3,650లు, 4కిలోవాట్లకు రూ.4,850, 5 కిలోవాట్లకు రూ.6,050లు చెల్లించాలన్నారు. వినియోగదారులే స్వచ్ఛందంగా డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ. ఏపీఎస్పీడీసీఎల్.ఇన్ వెబ్‌సైట్‌లో తమకు కావాల్సినంత అదనపు లోడ్‌కు రిజిస్టర్ చేసుకోవచ్చునన్నారు. ఈ రాయితీ జూన్ 30 వరకు మాత్రమే ఉంటుందన్నారు

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలువకుండా చూడండి: ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆదివారం ఉదయం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద వర్షపు నీరు నిలిచిందని సమాచారం అందడంతో ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మురుగు కాలువల్లో ప్రవహించే అవకాశం లేకపోవడంతో వర్షపునీరు బస్టాండు ఆవరణలో చేరిందన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను పిలిపించి మురుగు కాలువల్లో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని 35 వార్డుల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అక్కడ వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, దీనికి అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న మహేష్, జేసీబీ మధు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

గుర్రంకొండ ఎస్‌ఐగా రఘురాం

గుర్రంకొండ, మే 18(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ ఎస్‌ఐగా రఘురాం ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ మధురామచంద్రుడు బదిలీపై డీసీఆర్‌బీకి వెళ్లారు. దీంతో చిట్వేల్ ఎస్‌ఐగా పని చేస్తున్న రఘురాంను గుర్రంకొండలో నియమిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు.

మోడల్ ఈఏపీ సెట్ ఫలితాల విడుదల

కురబలకోట, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మోడల్ ఈఏపీ సెట్ ఫలితాలను ఆదివారం ప్రిన్సిపాల్ సి.యువరాజ్ విడుదల చేశారు. కళాశాలలో ఎంపీసీ విద్యార్థులకు ఈ నెల 11న పరీక్షలను నిర్వహించారు. ఈ ఫలితాలలో గుర్రంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్. సబీర్ 134 మార్కులలో మొదటి ర్యాంకు, శ్రీ వెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాలకు చెందిన విద్యార్థులు రాంచరణ్, సుహైల్‌లు 132 మార్కులతో ద్వితీయస్థానం, ఇదే కళాశాలకు చెందిన మధు చరణ్ 123 మార్కులతో తృతీయస్థానం, యాదుల్లా 114మార్కులతో నాల్గవస్థానం సాధించాడు. అనంతపురం నారాయణ కళాశాల విద్యార్థి వెంకటేశ్వర్లు 112 మార్కులతో ఐదవస్థానం, వెంకటరెడ్డి కళాశాలకు చెందిన విద్యార్థి ఠాకూర్ 110మార్కులతో 6వ స్థానం, గుర్రంకొండ ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థి సయ్యద్ అహ్మద్ 108 మార్కులతో 7వ స్థానం, తిరుపతి నారాయణ కళాశాలకు చెందిన లిఖిత 105 మార్కులతో 8వ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8712655132, 34. 38లను సంప్రదిం చాలని కోరారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ రామనాథం, పీఆర్వో మారుతీ ప్రసాద్, రియాజ్ తదితరులు అభినందించారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు

పాఠశాలల్లో రెండు మాధ్యమాలు కొనసాగించాలి

మదనపల్లె అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పాఠ శాలల్లో తెలుగు, ఇంగ్లిషు మాధ్యమాలు కొన సాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మదనపల్లెలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు గతంలో ఇచ్చిన హామీల ప్రకారం పిల్లలకు స్వేచ్ఛనిచ్చి ఇష్టం వచ్చిన మీడియం ఎంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ అనుమతించాలన్నారు. ఏప్రిల్ 23ను పరిగణనలోకి తీసుకుని ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 21 న పాత జిల్లా కేంద్రాల్లో నిర్వహించబోవు డీఈవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో వేల సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్య దర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, ప్రచురణ కమిటీ కన్వీనర్ విజయ్‌కుమార్, డివిజన్ కన్వీనర్ సుధాకర్, నాయకులు రవిప్రకాష్, మురళి, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

చల్లంగ చూడమ్మా.. గంగమ్మా..!

- నల్ల వీరగంగమ్మకు దీలు బోనాల సమర్పణ
- సింహ వాహనంపై నగరోత్సవం

వాల్మీకిపురం, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నల్లవీర గంగాభవాని ఆలయంలో ఆదివారం జాతర నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్టును అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి 108 కలశాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి స్థానిక కోనేటివీధి, నాయక్‌వీధులలోని గంగరాళ్లకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం గొల్లపల్లె, పటణానికి చెందిన వందలాదిమంది మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ అమ్మవారిని సింహవాహనంపై ఊరేగించారు. పట్టణ సమీపంలోని గొల్లపల్లె, బైపాస్ రోడ్డులోని అమ్మవారి ఆలయాల్లో కూడా భక్తులు దీలు బోనాలు సమర్పించారు. నిర్వాహకులు ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆనందశెట్టి, బలరాం, రమణారెడ్డి, పూజారి జనార్దనస్వామి, భక్తులు పాల్గొన్నారు.



దీలు బోనాలతో వెళ్తున్న మహిళలు

ఆలయానికి విరాళం..

మాజీ సర్పంచ్ నీరజమ్మ కుమారుడు భరత్‌రెడ్డి దంపతులు జాతర నిర్వహణకు రూ.90వేలు, ఎల్ ఆర్‌వీధికి చెందిన రాయదుర్గం శ్రీరాములు రూ.20వేలు విరాళాలు అందజేయగా వారిని ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది.

దాడి కేసులో నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పీలేరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ విద్యార్థిపై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణీకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పీలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం బీటెక్ చదువుతున్న జేమ్స్‌ను హింసించడంతోపాటు, నోట్లో మూత్రం పోసి రాక్షసానందం పొందడం క్షమించరాని విషయంగా పరిగణించాలన్నారు. దాడికి పాల్పడిన యశ్వంత్ నాయుడు, రూపీ, బ్లేడ్ కిరణ్, పవన్‌లపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జేమ్స్‌కు న్యాయం జరుగక పోతే మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో పీలేరు మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

154 మందికి కంటి పరీక్షలు

పీలేరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏవీఆర్ పాఠ శాల ఆవరణలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాల య సంస్థ నిర్వహించిన వైద్య శిబిరంలో 154 మంది కి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లకు అర్హులైన 25 మందిని ఎంపిక చేశారు. ఆపరేషన్‌కు ఎంపికైన రోగులను ఉచితంగా చెన్నైకి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి కంటి అద్దాలు, మందులు అందజేస్తారు. కంటి పరీక్షలు చేయించు కున్న వారికి ఐ డ్రాప్స్, మందులు ఉచితంగా ఇచ్చా రు. ఈ కార్యక్రమంలో మేము సైతం ఫౌండేషన్ నిర్వాహకులు ఎస్. షాహిన్‌షా, పీ. మొహ్మద్ ఆదిల్ ఖాన్, బుజ్జు, షాజహాన్, కలకడ బాబు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలి

మదనపల్లె టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు ఉద్యమిం చాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రై వేటు కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఆ యన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యావిధానాలను ఎండగట్టడానికి నేటి విద్యార్థులు పోరాడాలన్నారు. సమాజంపై అధ్యయనం చేసిన వారికి పోరాటం చేసే హక్కు ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, నాయకులు జయబాబు, అఫ్రీద్, సమీర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మదనపల్లె టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదివి 20 ఏళ్లు అయిన సందర్భంగా మదనపల్లె మండలం సీటీఎం జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం సీటీఎం జడ్పీ హైస్కూల్లో కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం చేయడానికి నిశ్చయించుకున్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం రుషికేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృపానందం, నాగమణి, విష్ణువర్ధన్, పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, బాబ్‌జాన్, వెంకటేశ్, శివశంకర్, ఖాదర్, అనిత, అక్కయ్య, పాల్గొన్నారు.



20 ఏళ్ల తరువాత కలుసుకున్న సీటీఎం జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థులు

మృత్యుంజయేశ్వర కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మచెరువు మిట్టలోని మృత్యుంజయేశ్వరాలయంలో మూడు రోజులపాటు కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయంలో కలశస్థాపన చేశారు. 19నప్రాణప్రతిష్ట, మహాగణపతి, సుబ్రహ్మణ్యం, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. కంచి పీఠాధిపతి జగద్గురువు శంకర విజేంద్ర సరస్వతిస్వామి విగ్రహప్రతిష్ఠ చేస్తారన్నారు. అనంతరం ఆలయంలో కుంభాభిషేకం జరుగుతోందన్నారు. ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు, పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సామల వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ మృతుల ఆత్మ శాంతికి నివాళులు

తంబళ్లపల్లె, మే 18(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ మృ తులకు ఆత్మశాంతి కలగాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది కొవ్వొత్తులు వెలి గించి నివాళులు అర్పించారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం పురస్కరించుకుని సాయంత్రం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది కొవ్వొత్తులను వెలిగించి హెచ్‌ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎయిడ్స్ లోగో వేసి దానిలో కొవ్వొత్తులను వెలిగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తేజస్విని మాట్లాడుతూ.. హెచ్‌ఐవి బాధితులపై ప్రేమ, సంఘీభావం కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టి బాలాజీ, కృషి సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి ఆక్రమిత భూమి స్వాధీనానికి శ్రీకారం?

- నేడు పోలీసు బందోబస్తుతో బీకే పల్లెకు...
- కంచె తొలగించి స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వ భూమి

మదనపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ కబంధ హస్తాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో వ్యూహరచన చేయగా సోమవారం స్వాధీనానికి ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఇప్పటికే తహసీల్దార్ ధనంజయులు, మండల సర్వేయర్ రెడ్డి శేఖర్‌బాబులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు ఉదయం 6 గంటలకే అందుబాటులో ఉండాలని సూచించారు. మదనపల్లె చుట్టూ పెద్దిరెడ్డి కుటుంబమే కాదు..వారి అనుచరులు ప్రభుత్వ, ప్రైవేటు భూములను పెద్ద ఎత్తున ఆక్రమించారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో పేదలు, రైతులు ఇలా ప్రతి ఒక్కరి నుంచి నయానో, భయానో స్వాధీనం చేసుకున్న ఉదంతాలు చాలానే ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి అధీనంలోని భూములను స్వాధీనం చేసుకోవడం కానీ, ఆక్రమిత భూమిలోకి ప్రవేశించిన దాఖలాలు లేవు. అయితే మొదటిసారిగా మదనపల్లె శివారు ప్రాంతాల్లోని అత్యంత ఖరీదైన బీకే పల్లె రెవెన్యూ గ్రామం-552లోకి ప్రవేశించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మూహూర్తం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. వారం రోజులుగా వ్యూహరచన చేయగా రెండురోజుల క్రితం కలెక్టరేట్‌లో డేట్‌ఫిక్స్ చేసినట్లు తెలిసింది. ఆది నుంచీ వివాదాలకు కేంద్రంగా మారిన బి.కె.పల్లె సర్వేనంబర్-552లో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలత పేరున భూములు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే రికార్డుల పరంగా వచ్చిన భూమి ఎంత? ఆ భూమి చుట్టూ ఆక్రమించిన భూమి ఎంత? అనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ నెంబర్‌పై సర్వే చేసి తేల్చాలని మండల సర్వేయర్‌కు చెబుతున్నారు. అయితే ఆయన రోవర్ రిపేరు వచ్చిందని, సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని చెబుతూ వచ్చినట్లు తెలిసింది. దీనిపై కలెక్టర్ దృష్టి సారించడంతో సోమవారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమిత భూమిని గుర్తించి, ఆ భూమి చుట్టూ వేసిన కంచెను తొలగించి ప్రభుత్వ భూమికి ట్రెంచి కొట్టాలని ఆదేశించారు. ఇందుకు ఓ అధికారి భయపడుతూ అటు, ఇటుగా చెప్పడంతో పోలీసు బందోబస్తు ఉంటుందని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. అయితే తాను సర్వే వరకే పరిమితం అవుతానని, ఆక్రమణలు తొలగించడం, స్వాధీనం చేసుకోవడం మీరే చూసుకోవాలనే ప్రతిపాదన పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందుకు ఓకే చెప్పడంతో పోలీసు బందోబస్తుతో పాటు వీర్వోలు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఉదయం 6 గంటలకే బైపాస్ రోడ్డులోని బి.కె.పల్లెలోని ఆక్రమిత స్థలానికి చేరుకోవాలని సూచించినట్లు తెలిసింది. అయితే కలెక్టర్ చెప్పినట్లు తహసీల్దార్, సర్వేయర్, సిబ్బంది ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ముందుకొస్తారా? లేక వాయిదా వేసి తప్పించుకుంటారా? అన్నది సోమవారం తేలనుంది. ఇక్కడి భూమిని మాజీ సైనికుడి కుటుంబం నుంచి కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. 20 ఏళ్లుగా వివాదంలో ఉన్న ఈ భూమిని పెద్దిరెడ్డి కుటుంబం అధికార బలంతో హస్తగతం చేసుకుంది. దీంతో పాటు అక్కడి భూమిలో నిర్మించిన చెక్‌డ్యాంను ధ్వంసం చేసి నామరూపాలు లేకుండా పూడ్చేశారు. అలాగే బి.కె.పల్లె పైభాగం నుంచి వర్షపునీటి కాలువను కబ్జా చేశారు. చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. అప్పట్లో దీనిపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని అధికారులు ఆ భూమి దరిదాపులకు కూడా వెళ్లలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో పెద్దిరెడ్డి అక్రమాలు, ఆక్రమణలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూములను పెద్దఎత్తున ఆక్రమించినట్లు గుర్తించిన ప్రభుత్వం పెద్దిరెడ్డిపై కేసులు నమోదు చేయాలని స్వయానా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పెద్దిరెడ్డి, వారి అనుచరులు ఆక్రమిత సామ్రాజ్యాల స్వాధీనంలో భాగంగా ప్రభు త్వం దృష్టి సారించినట్లు చర్చ జరుగుతోంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో? ఎలా ముందుకెళ్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.


మదనపల్లె బైపాస్‌రోడ్డు నుంచి బీకేపల్లె ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు.. దానిపక్కనే ఉన్న చెక్‌డ్యాం, వర్షపునీటి కాలువ (ఫైల్‌ఫొటో)


భూమి చదును చేసిన తర్వాత అదృశ్యమైన చెక్‌డ్యాం, కాలువ


ప్రభుత్వ భూమితో పాటు ఫెన్సింగ్ వేసిన వివాదాస్పద భూమి

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


గణేశ్ మృతదేహం

చెన్నూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంపాడుకు చెందిన పత్తూరు గణేశ్ (26) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గణేశ్ కడప నగరంలో పెయింటు పనిచేస్తూ జీవించేవాడు. ఇతనికి ఏడాదిన్నర క్రితం అంజు అనే యువతితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భవతి. ఆదివారం మధ్యాహ్నం తండ్రి, బావతో కలిసి స్థానిక పెన్నానదిలో చేపలు పట్టేందుకు వెళుతుండగా దారి మధ్యలో రెండు రోజుల క్రితం వీచిన గాలివానకు వేలాడుతున్న విద్యుత్‌వైర్లు తగలడంతో షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే అతని తండ్రి, బావలు వైర్లను పక్కకు తప్పించి వైద్యుడికి సమాచారం ఇవ్వగా అతను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

భారీ వర్షానికి మిద్దె కూలి ఇద్దరికి తీవ్ర గాయాలు


గజ్జెలవారిపల్లెలో భారీ వర్షాలకు కూలిన మిద్దె

పెద్దతిప్పసముద్రం మే 18 (ఆంధ్రజ్యోతి): పీటీఎం మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రాతి మిద్దె కూలడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... తుమ్మరకుంట గ్రామం గజ్జెలవారిపల్లెకు చెందిన తోపల శంకర తోపల నేత్రావతి దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. శనివారం యధావిధిగా రాత్రి భోజనం చేసి తమ ఇంటిలో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో మిద్దె లోపల నిద్రిస్తున్న తోపుల శంకర భార్య నేత్రావతి, కుమారుడు హరీష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి బండల కింద పడిపోయిన నేత్రావతి, హరీష్‌లను మదనపల్లెలోనే ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

చెట్టు కూలి వసతి గృహం ప్రహరీ నేలమట్టం


కూలిపోయిన బీసీ మహిళల వసతి గృహం ప్రహరీ

సిద్దవటం, మే 18 (ఆంధ్రజ్యోతి): సిద్దవటంలో శనివారం పెనుగాలుల బీభత్సంతో బీసీ మహిళా విద్యార్థినుల వసతి గృహంపై చెట్టు విరిగి పడడంతో ప్రహరీ గోడ పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంతాన్ని ఆదివారం బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవి, అటెండర్ అమల, వాచ్‌మెన్ పెంచలమ్మ పాల్గొన్నారు.

26 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

సుండుపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ఎంకేఆర్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 23వ తేదీ లోపు తమ టీం ఎంట్రీలను 9963368120, 9381145683 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

అంగరంగ వైభవంగా గర్నిమిట్ట తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ అమ్మవారు, అమ్మవారికి బోనాలు, పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

పీలేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్టలోని యల్లమ్మ తల్లి తిరుణాల ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తిరుణాల సందర్భంగా అమ్మవారికి ఆదివారం ఉదయం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం చింతమాకులపల్లెకు చెందిన వనం రాజశేఖర నాయుని కుటుంబసభ్యులు అమ్మవారికి తొలి బోనం సమర్పించి తిరుణాలను ప్రారంభించారు. నాయునివారి పూజ అనంతరం ఆలయంలో భక్తుల సందడి ప్రారంభమైంది. కేవీపల్లె మండలంతో పాటు పీలేరు, సుండుపల్లె, కలికిరి, కలకడ మండలాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు పెద్ద ఎత్తున బోణాలు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా కేవీపల్లె, గర్నిమిట్ట పరిసర ప్రాంతాల్లోని ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణం నెలకొంది. విద్య, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం బయటి ప్రాంతాల్లో ఉన్న చాలా మంది తిరుణాల కోసం స్వస్థలాలకు చేరుకుని కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కలకడ ఇన్‌చార్జ్ సీఐ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో కేవీపల్లె ఎస్‌ఐ చిన్నరెడ్డయ్య నేతృత్వంలో 60 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు గుడి వెంకటరమణ, గుడి శ్రీనివాసులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సూర్యప్రభ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి


జమ్మలమడుగు పురవీధుల్లో శ్రీవారి ఊరేగింపు

జమ్మలమడుగు, మే 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తుల కోలాటం మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపు చేశారు. అనంతరం స్నపన తిరుమంజనం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంలో శ్రీవారు దర్శనమిచ్చారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా జమ్మలమడుగు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఆర్ మైదానం)లో ఆదివారం ఒంగోలు జాతి ఎడ్ల జాతీయస్థాయి బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఆదివారం జూనియర్ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించగా 13 జతల ఎడ్లు పాల్గొన్నాయని.. సోమవారం సీనియర్ కేటగిరి విభాగంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆదినారాయణరెడ్డి

మునిబాబుకు డాక్టరేట్



వైస్ చాన్సలర్ హెచ్.సుదర్శన్‌రావు చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న మునిబాబు

పులివెందుల రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ముమ్మోల మునిబాబు జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్‌రావు చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మునిబాబు వీడియో ట్రాన్స్‌మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఇన్ వైర్‌లెస్ నెట్‌వర్క్‌లో పరిశోధనలు చేశారు. జేఎన్టీయూ అనంతపూర్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ చెన్నారెడ్డి, కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ప్రవీణ్ శ్యామ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేశారు. శనివారం అనంతపురం జేఎన్టీయూలో జరిగిన 14వ స్నాతకోత్సవం కార్యక్రమంలో వైస్ చాన్సలర్ చేతులమీదుగా పట్టా అందుకున్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి

చక్రాయపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో 19 నుంచి 22వ తేదీ వరకు హనుమజ్జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు అకురార్పణ, అనుజ్ఞ, విశ్వక్సేన ఆరాధన, తదితర కార్యక్రమాలతో ప్రారంభ మవుతాయన్నారు. 20, 21, 22 తేదీలలో ఉత్సవ పూజలు, హోమాలు ఉంటాయన్నారు. చివరి రోజు 22వ తేదీ ఉదయం 9గంటల నుంచి అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

మెగా డీఎస్సీ ప్రశ్నార్థకం...తులసిరెడ్డి

వేంపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డీఎస్సీ ప్రశ్నార్థకమైందని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విచారం వెలిబుచ్చారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలని మూడు రకాల పాఠశాలలు ఉండేవన్నారు. అందరికి సౌకర్యంగా, సౌలభ్యంగా ఉండేవన్నారు. వైసీపీ పాలనలో శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్+, ప్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్+ అని ఆరు రకాల స్కూళ్ల పెట్టి అయోమయం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యను తొమ్మిది రకాలుగా విభజించి చీలికలు పేలికలుగా చేసిందన్నారు. హైస్కూళ్లలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40 బదులు, 1:53 చేసిన ఫలితంగా 6428 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలారన్నారు. ఈ నేపథ్యంలో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డీఎస్సీ ప్రశ్నార్థకమైందన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి మూడుశాతం అదనపు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ

రామసముద్రం, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న భారత వీర జవాన్లకు సంఘీభావంగా కూటమి నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అమరులైన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. మదనపల్లి రూరల్ బీజేపీ అధ్యక్షుడు వెంకటరమణరెడ్డి, మండల జనరల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస మోదీ, జనసేన సూరి, సురేష్, నవీన్, పవన్, మంజునాథ్, సుబ్రహ్మణ్యం నాయుడు, గంగాధర్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: బి.కొత్తకోటలో కూటమి నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు కుడుం శ్రీనివాసులు, బంగారువెంకట్రమణ, కనకంటి ప్రసాద్, సమీవుల్లా, ప్రకాష్, రమేష్, ముకుంద, మునిరెడ్డి, మురళీ, దుమ్ముచిన్నా తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడి అమానుషం

మదనపల్లె, మే 18(ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్, విశ్వహిందుపరిషత్, హిందుసంఘాల సభ్యులపై దాడి అమానుషమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గట్టి రామ్మోహన్ విమర్శించారు. హనుమాన్ శోభాయాత్ర ప్రారంభం కాగానే పోలీసులు దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. హనుమాన్ మాలధారణలో ఉన్న భక్తులను అసభ్య పదజాలంతో దూషించడం, లాఠీచార్జి చేయడంతోపాటు అరెస్టు చేయడం సంప్రదాయబద్ధమైన కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాదు.. హిందువుల మనోభావాలపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. శాంతియుతంగా, చట్టబద్ధంగా జరిగే హిందు ధార్మిక కార్యక్రమాలపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి అకృత్యాలు పునరావృతమైతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కనుమలో గంగమ్మకు దీలు బోనాలు

మదనపల్లె, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పుంగనూరురోడ్డులోని కనుమలో గంగమ్మకు ఆదివారం దీలు, బోనాలు సమర్పించారు. పట్టణంలోని 11, 12 వార్డుల నుంచి ప్రజలు మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాలపతి ఆధ్వర్యంలో పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కె.కృష్ణప్ప, ఆంజనేయులు, సురేంద్ర, చిన్న ఆంజనేయులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'హనుమాన్ జయంతిని విజయవంతం చేద్దాం'

పీలేరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేద్దామని వీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు రాజుస్వామి పిలుపు నిచ్చారు. ఆదివారం పీలేరు పట్టణం సదుం మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22, 23 తేదీల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని 23 సాయంత్రం 4 గంటల నుంచి పుష్ప పల్లకిపై ఉత్సవమూర్తి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అశ్వవాహనంపై ఊరేగిన ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట, మే18(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఆదివారం ఏనుగుమల్లమ్మ జాతర ప్రారంభమైంది. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం, ధ్వజస్థంభ పూజ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి అశ్వవాహనంపై మల్లమ్మను ప్రతిష్ఠించి ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మదన్‌మోహనరెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు మృతి


మాకం అశోక్‌కుమార్ (ఫైల్)

మదనపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి) :పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య సంఘం నాయకుడు, పారిశ్రామికవేత్త మాకం అశోక్‌కుమార్ (75) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కంచి కామాక్షమ్మ అమ్మవారి గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా వేలూరు సమీపంలో వారి వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందారు. మదనపల్లె ఆర్యవైశ్యుల్లో ఆయన ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆయన కుమారుడు, కుమార్తె విదేశాల్లో స్థిరపడ్డారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు

గుర్రంకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు చాందినీ బండ్లు కట్టి మొక్కు చెల్లించుకొన్నారు. ఆదివారం సాయంకాలం యువకులు ఉట్టి కొట్టడానికి ఎగబడ్డారు. అమ్మవారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు

వేడుకగా దొడ్డిపల్లెమ్మ జాతర

కలకడ, మే 18(ఆంధ్రజ్యోతి): జాతర సందర్భంగా మండలంలోని కే. దొడ్డిపల్లెలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు చాందినీ బండిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అలాగే దొడ్డిపల్లెమ్మ అమ్మవారిని పూలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలుబోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.